క్లుప్తంగా

26న సర్వసభ్య సమావేశం

ఏర్పేడు: ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో ఈనెల 26వ తేదీ సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపీడీఓ గిడ్డయ్య గురువారం తెలిపారు. ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి హాజరుకానున్నట్లు చెప్పారు. ఆరోజు ఉదయం 10.30 గంటలకు జరిగే సమావేశానికి అన్ని శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరుకావాలని పేర్కొన్నారు.

చదువుపైనే దృష్టి సారించాలి

ఏర్పేడు: పదవ తరగతి పరీక్షలు దగ్గర పడుతున్న నేపథ్యంలో విద్యార్థులు చదువుపైనే దృష్టి సారించాలని బండారుపల్లి జెడ్పీ హైస్కూల్ ఆంగ్ల ఉపాధ్యాయుడు సుబ్రమణ్యం అన్నారు. గురువారం మండలంలోని మన్నసముద్రంలో నైట్‌విజన్‌లో భాగంగా విద్యార్థుల ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలను సెల్‌ఫోన్‌లు, టీవీలకు దూరంగా ఉండేలా చూడాలని తెలిపారు. పాఠశాలలో ఉపాధ్యాయులు ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నట్లు వివరించారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ

సత్యవేడు: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎంఈఓ కె. రవి అన్నారు. గురువారం మండలంలోని చెరివి ఎంపీపీ పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని వంట నిర్వాహకులు శాంతమ్మ, రత్నమ్మకు సూచించారు. భోజనాన్ని పరిశుభ్రమైన వాతావరణంలో తయారు చేయాలని ఆదేశించారు. ప్రత్యేక మైన వంట గదిలో భోజనం తయారు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అనంతరం మధ్యాహ్న భోజన పదార్థాలను పరిశీలించారు. మెనూ ప్రకారం లెమన్ రైస్, టమాటా కర్రీ, గుడ్లు పెట్టినట్లు హెచ్ఎం చంద్రయ్య పాల్గొన్నారు.

పండ్లు, బిస్కెట్లు పంపిణీ



ఆస్పత్రిలో పండ్లు పంపిణీ

శ్రీకాళహస్తి: స్కౌట్స్ అండ్ గైడ్స్ వ్యవస్థాపకుడు లార్డ్ మౌంట్ బేడన్ పావెల్ జయంతిని పురస్కరించుకుని పట్టణంలో ప్రపంచ ఆలోచన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక ఏరియా ఆస్పత్రిలో రోగులకు పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. అనంతరం బాబుఅగ్రహారం పురపాలకసంఘ ఉన్నత పాఠశాలలో బేడన్ పావెల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా అడల్ట్ రిసోర్స్ కమిషనర్ ఎంఎం రెడ్డి, కార్యాలయ కమిషనర్ రమేష్‌బాబు మాట్లాడుతూ రానున్న మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో సేవ చేసేందుకు సిద్ధంగా ఉండాలని స్కౌట్స్ అండ్ గైడ్స్‌కు సూచించారు.

సిపాయి భరోసా అందజేత

శ్రీకాళహస్తి: మండలంలోని పుల్లారెడ్డికండ్రిగ గ్రామంలో రాజేష్, బత్తెయ్య కుటుంబాలకు సిపాయి భరోసా అందింది. వీరిద్దరూ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. వారి కుటుంబ నేపథ్యం తెలుసుకుని గురువారం ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం ఆగ్రామానికి వెళ్లి ఏడాదికి సరిపడే 40 రకాల నిత్యావసర సరుకలను అందజేశారు. సర్పంచ్ మధురెడ్డి పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి వాయులింగేశ్వర మొబైల్ షాప్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎస్.షాహిర్, ప్రధాన కార్యదర్శిగా సురేంద్రయాదవ్, గౌరవాధ్యక్షుడిగా కేహెచ్ ప్రసాద్ ఎంపికయ్యారు. ఉపాధ్యక్షుడిగా జుంలే షా, కోశాధికారిగా హుమాయున్, ఉపకార్యదర్శులుగా శరత్, శంకర్, అరుణ్, పీఆర్వోగా ముబారక్, సభ్యులను ఎన్నుకున్నారు.

కాలువల నిర్మాణానికి భూమి పూజ



రేణిగుంట: రేణిగుంట జ్యోతినగర్‌లో రూ.6లక్షల అంచనాతో మురుగునీటి కాల్వల నిర్మాణానికి గురువారం వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జి బియ్యపు పవిత్రారెడ్డి భూమిపూజ చేశారు. ఆమె మాట్లాడుతూ రేణిగుంటలో పలు అభివృద్ధి పనులు చేపట్టినట్లు వివరించారు. మంచి నీళ్ల గుంటను సుందరంగా తీర్చిదిద్దనున్నట్లు వివరించారు. జెడ్పీటీసీ సభ్యురాలు టి.సంధ్యారాణి, వైస్ ఎంపీపీ సుజాత, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్, సర్పంచ్ నగేషం, కోఆప్షన్ సభ్యుడు హసన్, ఉప సర్పంచ్ ఇర్ఫాన్, జాన్‌బాబు, ఖదీర్, రఫి, ఇన్బనాథన్ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను నిర్మూలిద్దాం

రేణిగుంట: బాల్య వివాహాల నిర్మూలన అందరి బాధ్యత అంటూ అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది విద్యార్థులతో కలసి గురువారం రేణిగుంటలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ ప్లకార్డులను ప్రదర్శించారు.

వలంటీర్ల వ్యవస్థ దేశానికే ఆదర్శం



తొట్టంబేడులో వలంటీర్లను సన్మానిస్తున్న బియ్యపు పవిత్రారెడ్డి



రేణిగుంట: వలంటీర్లకు అవార్డు అందిస్తున్న పవిత్రారెడ్డి

శ్రీకాళహస్తి: రాష్ట్రంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తీసుకువచ్చిన వలంటీర్ల వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని వైఎస్సార్ సీపీ తొట్టంబేడు మండల ఇన్‌చార్జి బియ్యపు పవిత్రారెడ్డి అన్నారు. తొట్టంబేడు మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో గురువారం వలంటీర్లకు పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన పవిత్రారెడ్డి మాట్లాడుతూ గతంలో ప్రభుత్వ పథకాలు అంటే ఒక కుటుంబానికో, ఓ నాయకుడి కనుసన్నల్లో మెలిగేవారికో మాత్రమే దక్కేవని తెలిపారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే కుల, మత, వర్గ, రాజకీయాలకతీతంగా అర్హులైన ప్రతి కుటుంబానికి పథకాలు అందించే లక్ష్యంతో సచివాలయం, దానికి అనుబంధంగా వలంటీర్ల వ్యవస్థను తీసుకొచ్చినట్లు పేర్కొన్నారు. తమ పరిధిలో ఉన్న 50 కుటుంబాలకు పథకాలను లబ్ధిదారుల ఇంటికే చేరుస్తూ ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వలంటీర్లు వారధులుగా మారారని తెలిపారు. వలంటీర్ల వ్యవస్థపై ఆరోపణలు చేసిన వారే వారి సేవలను చూసి మౌనం వహించారని చెప్పారు. వలంటీర్ల సేవలు వెలకట్టలేనివని తెలిపారు. సచివాలయ, వలంటీర్ల వ్యవస్థలను పలు రాష్ట్రాలు అమలు చేసేందుకు మన రాష్ట్రం వైపు ఆసక్తిగా పరిశీలిస్తున్నాయని పేర్కొన్నారు. ఉత్తమ వలంటీర్లకు సేవా వజ్ర కింద రూ.45వేలు, సేవారత్న కింద రూ.30వేలు, సేవామిత్ర కింద రూ.15వేలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం వలంటీర్లను దుశ్శాలువ, పతకాలు, ప్రశంసా పత్రాలతో సన్మానించారు. వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు ఉన్నం వాసుదేవ నాయుడు, వైస్ ఎంపీపీ గెరటారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ మణినాయుడు, సర్పంచ్ సుబ్బయ్య, శ్రీకాళహస్తీశ్వరాలయ ట్రస్టు బోర్డు సభ్యుడు భాస్కర్, ఎంపీడీవో ప్రవీణ్, ఈవో పీఆర్డీ తరుణాక్షరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



కేవీబీపురం: వలంటీర్లను సన్మానిస్తున్న నేతలు

వలంటీర్ల సేవలు ప్రశంసనీయం

రేణిగుంట: రాష్ట్రంలో నాలుగేళ్లుగా వలంటీర్లు చేస్తున్న సేవలు అమూల్యమని వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జి బియ్యపు పవిత్రారెడ్డి ప్రశంసించారు. ఎంపీడీవో కార్యాలయ ఆవరణంలో గురువారం సాయంత్రం గ్రామ, వార్డు వలంటీర్లకు సేవా మిత్ర, సేవారత్న, సేవా వజ్ర వచ్చిన వారికి ఆమె అవార్డులను ప్రదానం చేసి చేసి సన్మానించారు. ఎంపీపీ కలపాటి హరిప్రసాద్‌రెడ్డి, జెడ్పీటీసీ సంధ్యారాణి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గంగారి రమేష్, ఎంపీడీవో విష్ణుచిరంజీవి, వైస్ ఎంపీపీ సుజాత, జువ్వల దయాకర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్, రసూల్, హసన్, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

పథకాలను అందించడంలో కీలకపాత్ర

కేవీబీపురం: పథకాలను అందించడంలో వలంటీర్లే కీలకమని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గవర్ల కృష్ణయ్య అన్నారు. ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో గురువారం వలంటీర్లకు అవార్డులను ప్రదానం చేశారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన కృష్ణయ్య మాట్లాడుతూ ఒకటో తేదీనే అవ్వాతాతలకు పింఛన్లను అందిస్తూ వలంటీర్లు సేవలు అందిస్తున్నారని తెలిపారు. అనంతరం ఇద్దరికి సేవా వజ్రా 2, ఐదుగురికి సేవారత్న, 211 మందికి సేవా మిత్ర అవార్డులను అందించి, సన్మానించారు. జెడ్పీటీసీ సభ్యుడు మునెమ్మ, వైస్ ఎంపీపీ శ్రీనివాస్‌యాదవ్, ఎంపీటీసీ సభ్యుడు సుబన్న, అయ్యప్ప, పార్టీ నేతలు లాల్‌బాబుయాదవ్, నందకుమార్, శాస్త్రిరాజు, వెంకటరత్నం, రామ్మోహన్‌వర్మ తదితరులు పాల్గొన్నారు.

సేవా పురస్కారాల ప్రదానం



పిచ్చాటూరులో సన్మానం అందుకున్న వలంటీర్లు



నాగలాపురంలో ..



కీళపూడిలో ..

పిచ్చాటూరు: ఎంపీడీఓ కార్యాలయంతో పాటు ఆయా సచివాలయాల్లో గురువారం వలంటీర్లను సన్మానించి, ప్రసంసాపత్రాలు అందించారు. ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఏఓ రాధారాణి మాట్లాడుతూ మండలంలో 174 మంది వలంటీర్లు ఉండగా, ఒకరికి సేవా వజ్ర, ఐదుగురికి సేవారత్న, 168 మందికి సేవా మిత్ర పురస్కారాలు అందజేసినట్లు తెలిపారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కేవీ చలపతిరాజు, రాష్ట్ర కార్యదర్శి కేవీ భాస్కర్ నాయుడు, సింగిల్ విండో చైర్మన్ కేటీ హరిశ్చంద్రా రెడ్డి, సర్పంచ్‌లు కేజీ రోస్ రెడ్డి, కిరణ్‌కుమార్, వైస్ ఎంపీపీ విజయమ్మ, జేసీఎస్ కన్వీనర్ తొప్పయ్య, వైఎస్సార్ టీయూసీ మండల అధ్యక్షుడు మునిరాజ, మండల మాజీ ఉపాధ్యక్షుడు పాలపద్మనాభం, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

నాగలాపురంలో ..

నాగలాపురం: ఎంపీడీఓ కార్యాలయంలో సర్పంచ్ సుధ అధ్యక్షతన గురువారం వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. మండలంలో 184 మంది వలంటీర్లు ఉండగా, ఇద్దరికి సేవా వజ్ర, 177 మందికి సేవా మిత్ర, ఐదుగురి సేవా రత్న ప్రదానం చేశారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు అపరంజిరాజు, ఎంపీపీ సింధూ, వైస్‌ఎంపీపీ కుమారి, ఎంపీడీఓ పీఎంకె బాబు, పంచాయతీ కార్యదర్శి నాగరత్నమ్మ పాల్గొన్నారు.

ముక్కంటిసేవలో జర్మనీ భక్తులు



రాహుకేతు పూజల్లో జర్మనీ భక్తులు

శ్రీకాళహస్తి: శ్రీజ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామివారిని గురువారం జర్మనీకి చెందిన అరుగురు భక్తులు దర్శించుకున్నారు. ముందుగా వారు రాహుకేతు సర్పదోష నివారణ పూజలు చేయించుకున్నారు. అనంతరం స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. వేదపండితులు వారిని ఆశీర్వదించారు. ఆలయ శిల్పకళను వారు కొనియాడారు.

పార్లమెంట్ కమిటీ సభ్యుడు

శ్రీకాళహస్తీశ్వరస్వామివారిని గురువారం పార్లమెంట్ కమిటీ సభ్యుడు డాక్టర్ భగవత్ కిషన్‌రావు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. దక్షిణ గోపురం వద్ద ఈఓ ఎస్వీ నాగేశ్వరరావు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు.

భోపాల్ ఎమ్మెల్యే..

శ్రీకాళహస్తీశ్వరస్వామిని గురువారం మధ్యప్రదేశ్ రాష్ట్రం భోపాల్ ఎమ్మెల్యే విష్ణు కత్రీజీ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. ముందుగా ఆయన ప్రత్యేక రాహుకేతు పూజలు చేయించుకున్నారు. అనంతరం స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు.

ఆగమోక్తంగా గురు దక్షిణామూర్తికి పూజలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో మేథో గురు దక్షిణామూర్తికి గురువారం ఆగమోక్తంగా పూజలు నిర్వహించారు. ముందుగా కలశ ప్రతిష్ట చేశారు. అనంతరం వినాయక పూజ, కలశ పూజ, వైదిక క్రతువులు నిర్వహించారు. అనంతరం స్వామివారికి పంచామృతం, చందనం, నారికేళ, కలిశ జలాలతో అభిషేకం నిర్వహించారు. సుగంధభరిత పుష్పమాలికలు, స్వర్ణాభరణాలతో విశేషంగా అలంకరించి . ధూప,దీప నైవేద్యాలు సమర్పించారు. పర్వత హారతి, చక్ర హారతి, కుంభ హారతి, మహా మంగళహారతులు ఇచ్చారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు.

బాలాలయం ఏర్పాటు



హోమ పూజలు చేస్తున్న పండితులు

నాగలాపురం: మండల కేంద్రంలోని ఉత్తరపు కోట వీధిలోని శ్రీహరికంఠేశ్వర స్వామి ఆలయంలో ఆలయ జీర్ణోద్ధరణలో భాగంగా బాలాలయం ఏర్పాటు చేశారు. ఆలయం ఎదుట వేద పండితులు విశేష హోమ పూజలు చేసి శాస్త్రోక్తంగా బాలాలయం ఏర్పాటు చేశారు. జీర్ణోద్ధరణ పనులు పూర్తయి, కుంభాభిషేకం జరిగేంతవరకు బాలాలయంలోనే స్వామివారి దర్శనం ఉంటుందని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

మంచి ఫలితాలతో ఉజ్వల భవిష్యత్తు



సరస్వతి పూజలో విద్యార్థులు

సత్యవేడు: పదోతరగతి పరీక్షల్లో మంచి ఫలితాలు సాధిస్తే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఉపాధ్యాయుడు పి.వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం బాలుర ఉన్నత పాఠశాలలో వీడ్కోలు సమావేశం ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ లక్ష్యాన్ని ఎంచుకుని ఆదిశగా ఇష్టపడి చదివితే మంచి ఫలితాలు పొందవచ్చని తెలిపారు. విద్యార్థులకు ఆయన ప్యాడ్లు, పెన్నులు వితరణగా అందజేశారు. తొలుత శ్రీసరస్వతీ దేవి నిర్వహించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అకట్టుకున్నాయి.

కేంద్ర మంత్రికి సాదర స్వాగతం



స్వాగతం పలుకుతున్న జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

రేణిగుంట: తిరుపతి శ్రీవారి దర్శనార్థం విచ్చేసిన కేంద్ర మంత్రి భగవత్ కిషన్ రావ్ కరడ్‌కు గురువారం రేణిగుంట విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. మంత్రికి జిల్లా కలెక్టర్ జీ.లక్ష్మీశ పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. అనంతరం మంత్రి రోడ్డు మార్గాన తిరుమలకు బయల్దేరి వెళ్లారు. రేణిగుంట తహసీల్దార్ నాగేశ్వరరావు, ఎయిర్‌పోర్ట్ అధికారులు ఆయనకు స్వాగతం పలికిన వారిలో ఉన్నారు.

రిజిస్ట్రేషన్‌కు అదనపు వసూళ్లు

సత్యవేడు: స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో స్థలాలు రిజిస్ట్రేషన్ చేసుకుంటే అదనంగా వసూలు చేస్తున్నారని బుచ్చినాయుడుకండ్రిగ మండలం నెలవాయి గ్రామ మహిళలు రేష్మ, లలిత ఆరోపించారు. గురువారం సత్యవేడు ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడారు. అక్కడ ఓ ప్రవేటు వ్యక్తి, జూనియర్ అసిస్టెంట్ కలసి భూమి విలువకు రెండు నుంచి 5 రెట్లు అదనంగా వసూలు చేస్తున్నారని విమర్శించారు.

జగనన్నతోనే అన్ని వర్గాల సంక్షేమం



మాట్లాడుతున్న విద్యానాథరెడ్డి

బుచ్చినాయుడుకండ్రిగ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డితోనే అన్ని వర్గాల సంక్షేమం సాధ్యమని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అరణి విద్యానాథరెడ్డి తెలిపారు. గురువారం స్థానిక మార్కెట్ యార్డులో వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలో వైఎస్సార్ సీపీ విజయమే లక్ష్యంగా సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం కొనసాగాలంటే జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సత్యవేడు నుంచి పోటీ చేసే అభ్యర్థికి భారీ మెజారిటీ వచ్చేలా కృషి చేయాలని తెలిపారు. నాయకులు మునిరాజా, కారణిహరిబాబు, మునిరత్నంనాయుడు, మునస్వామి, పెంచలయ్య, తిరుపాల్, మాజీ ఎంపీపీ మానికలవెంకటమ్మ, సర్పంచ్ వెంకటమ్మ, వెంకటయ్య, తులసీ, భాస్కరయ్య, పెంచలయ్య, యాకబ్, సురేష్, బాలశేఖర్ పాల్గొన్నారు.

జగనన్న వెంటే చేనేత కార్మికులు



హర్షం వ్యక్తం చేస్తున్న మర మగ్గ కార్మికులు

- సర్‌చార్జి, డ్యూటీ చార్జి తగ్గింపుపై హర్షం
- సీఎం హామీని నిలబెట్టుకున్నారని ఆనందం

నారాయణవనం: తమ కష్టాలను గుర్తించి ఆర్థిక భరోసా కల్పిస్తూ విద్యుత్ బిల్లులపై పూర్తిగా సర్‌చార్జిని, డ్యూటీని తొలగించడంపై హర్షం వ్యక్తం చేస్తూ, తామంతా ముఖ్యమంత్రి జగనన్న వెంటే అంటూ మర మగ్గ కార్మికులు నినాదాలు చేస్తూ తమ విశ్వాసాన్ని చాటుకున్నారు. నగరిలో మూడో విడత విద్యాదీవెన పంపిణీ సభలో మర మగ్గ కార్మికుల కష్టాలను గుర్తించి సర్‌చార్జి, డ్యూటీలను తొలగిస్తామని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారు. ఈమేరకు జీవో విడులైంది. దీంతో నెలకు రూ.వెయ్యి నుంచి 1500 వరకు మరమ్మగ్గాల విద్యుత్ బిల్లులు తగ్గనున్నాయి. గురువారం సాయంత్రం నారాయణవనం చిత్రాంగి కోటవీధిలో ఎంపీపీ దివాకర్‌రెడ్డి, మరమ్మగ్గ కార్మికుల సంఘం నాయకులు అన్నాదొరై, వైస్ ఎంపీపీ శివశంకర్ ఆధ్వర్యంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి కృతజ్ఞతలు చెబుతూ కార్మికులు హర్షం వ్యక్తం చేశారు. నాయకులు అన్నాదొరై, గురుస్వామి మాట్లాడుతూ నారాయణవనంలో సుమారు 1200 కుటుంబాలు మరమ్మగ్గాలపై ఆధారపడి జీవిస్తున్నాయని అన్నారు. విద్యుత్‌చార్జీలు చెల్లించలేక పలువురు కార్మికులు వృత్తిని వదులుకున్నారని తెలిపారు. విద్యుత్ శాఖా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని కలిసి వినతి పత్రాలను అందజేశామన్నారు. మంత్రి పెద్దిరెడ్డి హామీతో జగనన్న మరమ్మగ్గ కార్మికులకు అండగా నిలుస్తూ యూనిట్ విద్యుత్ వాడకంపై విధిస్తున్న 94 పైసలు సర్‌చార్జీని, 6 పైసల డ్యూటీ చార్జీని పూర్తిగా తొలగిస్తూ జీవోను విడుదల చేశారని తెలిపారు. దీంతో ఒక మగ్గంపై నెలకు రూ 250 విద్యుత్ బిల్లు తగ్గుతుందని పేర్కొన్నారు.

బస్టాండ్ ఆధునీకరణకు ప్రతిపాదనలు

- రాష్ట్రంలోని బస్టాండ్‌లను తనిఖీ చేస్తా
- ఆర్టీసీ వైస్‌చైర్మన్ మిద్దెల హరి



మిద్దెల హరిని సన్మానిస్తున్న ఆర్టీసీ ఆర్ఎం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి ఆర్టీసీ బస్టాండు ఆధునికీకరణకు ప్రతిపాదనలు పంపాలని రీజినల్ మేనేజరు చెంగల్‌రెడ్డికి ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ మిద్దెల హరి సూచించారు. తిరుపతి ఆర్టీసీ రీజినల్ మేనేజరు చెంగల్‌రెడ్డి గురువారం వైస్ చైర్మన్‌ను శ్రీకాళహస్తిలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తిరుపతి జిల్లాలో ఆర్టీసీ బస్టాండ్ల పరిస్థితిపై హరి ఆరా తీశారు. ముఖ్యంగా శ్రీకాళహస్తి ఆర్టీసీ బస్టాండులో మౌలిక వసతులు పరిస్థితి అధ్వానంగా ఉన్నాయని, వెంటనే ఆధునీకరణకు ప్రతిపాదనలు పంపాలని ఆర్ఎం చెంగల్‌రెడ్డి, డిపో మేనేజర్ రాజవర్ధన్‌రెడ్డిని ఆదేశించారు. శ్రీకాళహస్తి ఆలయ పట్టణం కావడంతో ఆధునీకరణ పనుల్లో ఆధ్యాత్మికత శోభ ఉట్టిపడేలా చర్యలు చేపట్టాలని సూచించారు. అందుకోసం అవసరమయ్యే నిధులు సత్వరమే విడుదలయ్యేలా చొరవ తీసుకుంటానని హామీ ఇచ్చారు. రాష్ట్రంలోని అన్ని బస్టాండ్లను తనిఖీ చేసి మౌలిక వసతులు అభివృద్ధికి కృషి చేస్తానని స్పష్టం చేశారు. ఆర్టీసీ సీటీఎం భాస్కర్ రెడ్డి, మునిచంద్ర, వైడీ కుమార్ పాల్గొన్నారు. చేనేత, జౌళీ శాఖ ఎండీ పిచ్చేశ్వరరావు, పీవీ సుబ్బానాయుడు కూడా మిద్దెల హరిని కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

పోరాట యోధుడు ఉయ్యాల వాడ



సత్యవేడు: నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు



శ్రీకాళహస్తి: నివాళులర్పిస్తున్న నాయకులు

సత్యవేడు: సిపాయుల తిరుగుబాటుకు పదేళ్లకు ముందే బ్రిటీష్ పాలకులకు ముచ్చెమటలు పట్టించిన గొప్ప పోరాట యోధుడు 'ఉయ్యాల వాడ నరసింహారెడ్డి' అని బాలుర హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు కె.భారతి అన్నారు. గురువారం స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహా రెడ్డి వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆమె మాట్లాడుతూ.. 1806 నవంబరు 24న నంద్యాల జిల్లాలోని ఉయ్యాలవాడ మండలం రూపనగుడి గ్రామంలో జన్మించిన ఉయ్యాల వాడ నరసింహారెడ్డి బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా పోరాటాలు నిర్వహించారని తెలిపారు. ఆయన జ్ఞాపకార్థం ఓర్వకల్లు వద్ద ఉన్న విమానాశ్రయానికి ఉయ్యాలవాడ పేరు పెట్టారన్నారు. ఉయ్యాల వాడ జీవిత చరిత్రను వివరించారు.

శ్రీకాళహస్తిలో..

శ్రీకాళహస్తి: పట్టణంలోని పెండ్లి మండపం సెంటర్ వద్ద రెడ్డి వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సమర యోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అసోసియేషన్ నాయకులు భాగ్యలక్ష్మి, చెంచురెడ్డి, సునీల్‌కుమార్‌రెడ్డి, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

హెచ్‌వీసీ పథకానికి దరఖాస్తు చేసుకోండి



వెస్టువరత్తూరులో వంగ పంటను పరిశీలిస్తున్న యామినీ

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కాకర, వంగ, మిరప, పంటలను సాగు చేస్తున్న రైతులు హైబ్రిడ్ వెజిటబుల్ కల్టివేషన్(హెచ్‌వీసీ) పథకానికి దరఖాస్తు చేసుకోవాలని మండల ఉద్యానవనశాఖాధికారి యామిని తెలిపారు. ఆమె గురువారం మండలంలోని కంచనపుత్తూరు, వెస్టువరత్తూరు, గ్రామాల్లో సాగులో ఉన్న కాకర, వంగ, మిరప పంటలను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ కూరగాయల పంటలను సాగు చేస్తున్న రైతులకు హైబ్రిడ్ వెజిటబుల్ కల్టివేషన్ పథకం ప్రభుత్వం ఆర్థిక సహాయం చేస్తుందన్నారు. రైతు భరోసా కేంద్రంలోని అగ్రికల్చర్ అసిస్టెంట్ వద్ద పట్టదారు పాసుబుక్, ఆధార్ కార్డు, బ్యాంకు పాసు బుక్ జెరాక్స్‌లతోపాటు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో, విత్తనాల కొనుగోలు బిల్లును అందజేసి ఈ పథకానికి నమోదు చేసుకోవాలని తెలిపారు. తేనే మంచుతో మామిడి చెట్లలో పూత రావడం లేదన్నారు. ఇందు కోసం మోనోక్రోటోఫాస్ 1.6 మిల్లీలీటర్లు లేదా మంకోజెబ్ 2 గ్రాములను లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. తామర పురుగు నివారణకు ఫ్రూట్ కవర్స్‌ను వాడాలని తెలిపారు. మామిడి, మిరప పంటల సాగుకు సంబంధించి 7995086941 నంబర్‌ను సంప్రదిస్తే సలహాలు, సూచనలు ఇస్తామని పేర్కొన్నారు.

మధ్యాహ్న భోజనం నాణ్యతగా ఉండాలి

బుచ్చినాయుడుకండ్రిగ: జగనన్న గోరుముద్ద మధ్యాహ్న పథకంలో రుచికరమైన భోజనాన్ని విద్యార్థులకు పెట్టాలని వంట నిర్వహకులకు మండల విద్యాశాఖాధికారి మునిసుబ్రమణ్యం తెలిపారు. గురువారం తలారివెట్టు ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలును తనిఖీ చేశారు. పదార్థాల రుచి చూశారు. ఆయన మాట్లాడుతూ మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని అందించాలని తెలిపారు.

ట్యాబ్‌లతో సాంకేతిక విద్య

కాలానుకనుగుణంగా సాంకేతిక విద్యా బోధన అందించాలన్న సంకల్పంతోనే ప్రభుత్వం 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లను పంపిణీ చేస్తోందని ఎంఈఓ మునిసుబ్రమణ్యం తెలిపారు. కల్లివెట్టు జెడ్పీ హైస్కూల్‌లో 8 వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌ల వినియోగంపై అవగాహన కల్పించారు.

బాల్య వివాహాలను అరికట్టాలి

శ్రీకాళహస్తి: పట్టణంలోని రోటరీక్లబ్‌లో గురువారం డీఎస్పీ బి.ఉమామహేశ్వర్‌రెడ్డి, 1వ పట్టణ సీఐ ఎస్వీ నరసింహారావు, ఐసీడీఎస్ సీడీపీవో శాంతిదుర్గ ఆధ్వర్యంలో బాల్యవివాహాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఐసీడీఎస్ అధికారులు, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు, మహిళా పోలీసులు పాల్గొన్న ఈ సమావేశంలో డీఎస్పీ మాట్లాడుతూ మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా కల్యాణం రోజున బాల్య వివాహాలు జరుగకుండా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. అధికారులు గ్రామాల్లో పర్యటించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు ఐసీడీఎస్ అధికారులు, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు, మహిళా పోలీసులు తదితరులు పాల్గొన్నారు.